


# వ్యాకరణశాస్త్రం

శ్రీ కోపూరి నారాయణరావు బి. యస్. సి.

ఆనాడు వాడు విచారంగా వున్నట్టు వాడి మొహమే చెప్పింది. వాళ్ళ నాన్న చెంప వాయించి పంపేశాట. ఏదో ఒక సూత్రం తప్పు చెప్పేటప్పటికి ఆయనగారికి కోపంవచ్చి, "చెంపకు చేయి పరమయినపుడు దుఃఖం బావేశించును" అని చేసి చూపెట్టాడుట

"తెలుగు వ్యాకరణ శాస్త్రం కంటే ఇంగ్లీషు గ్రామరు సులభంగా వుంటోవున్నాదండీ. బాల వ్యాకరణం చూడటం రాక్షసి దర్శనంలా వుంటుందండీ" అని నాతో మొరపెట్టుకొన్నాడు.

పది సంవత్సరాల మూర్తి రాజుకు నేను ప్రయివేటు ట్యూటరుగా నియమింపబడినప్పటినుండీ, అతని కష్టసుఖాలు నాతో విప్పి చెప్పుతూ వుండేవాడు.

నేను ఇంగ్లీషు ట్యూటరుగా వుండినను, అతనికి సహాయము చేసే వుద్దేశంతో వ్యాకరణం చెప్పడానికి పూనుకొన్నాను.

"అబ్బాయీ, యిటుచూడూ- పొరుగింటి పుల్లకూర రుచి అన్నట్టు ఇంగ్లీషు గ్రామరు సులభమంటావేమిటి? అంతకంటె సులభముగా వ్యాకరణం నేర్పుతాను" అన్నాను.

"సరేనండి" అని అన్నాడు చేతులు కలిపి.

"మొట్టమొదట "అ" అనే అక్షరం యొక్క ప్రాముఖ్యతను నేర్చుకోవాలి."

మూర్తి రాజు మౌనం వహించాడు. నా వుపోద్ఘాతాన్ని మొదలు పెట్టాను.

"సత్యము అనేపదానికి ఎదురు అర్థం రావడానికి-అ- కలపాలి."

"అవును- అసత్యము అనాలి" అన్నాడు.

"ఇక విను- నేను చదువుకొంటూ వున్నప్పుడు యింటికి వెళ్తే, ప్రొద్దుపోవడానికి అప్పుడప్పుడూ 'వాసవి' భాండాగారానికి వెళ్లుతూవుండడం అలవాటు.

ఆరోజుకూడా వెళ్లాను.

ఒకటీ, రెండూ అంటే కొనుక్కోగలం కాని, గ్రంథాలయంలోకి వచ్చే పత్రికలన్నీ కొనుక్కొని చదువుకోటానికి వీలుకాదు- చాలా పత్రికలు అందరికీ అందుబాటులో వుంచుటకొరకే గ్రంథాలయ స్థాపన జరుగుతూ వుంది.

మూర్తి రాజు నే చెప్పే మాటలు వినకుండా పడవవాళ్ల పాటమీద మనసు పోనిచ్చాడు- వినేవరకూ- ఓపిక పట్టి మళ్ళీ మొదలెట్టాను.

"ఆరోజు నేను వెళ్ళడంతోటే ఎవరో యిల్లస్ట్రేటెడ్ వీక్లీ చూస్తూ వుండటం తటస్థించింది. ఆ పత్రికను చదువ దలచుకొన్నాడు."

మూర్తి రాజు కాలకృత్యం తీర్చుకుని వచ్చేవరకు అయిదు నిముషాలు వూరుకొన్నాను.

ఆయన చదివేవరకూ, ఓపికబట్టి కూర్చుని, తరువాత నేను తీసికొని తీరికగా చదువుకుంటూ కూర్చున్నాను.

మంచి వ్యాసాలు, కథలు, బొమ్మలు వుండడం మూలాన ఒక గంట గడిచింది.

అక్కడి గ్రంథాలయాధికారి, [పెద రమణయ్య] నా ప్రక్కడ వచ్చి నేను చదువుకుంటూ వున్న పత్రికను యివ్వమని అడిగాడు. నేను ఆశ్చర్య పడ్డాను. చదువుతూ వున్న పత్రికను అడగడం నాకు అలవాటు లేదు. అదివొక పెద్దమనిషి చేయవలసిన పని కాదు.

అలాగే, ఆ పత్రికా రచనలలో నిమగ్నుడనయిపోయి యింకొక అరగంట గడిపివుంటాను.

ఆ పత్రిక నా అధీనంలో గంటన్నర వుండటంలో చీమతలకాయ అంతయినా అసత్యంలేదు. మళ్లీ పెద రమణయ్యగారు వచ్చారు.

"సత్యానికి- అ- ముందు చేర్చారు కాదూ" అని అడ్డువచ్చాడు మూర్తి రాజు. వాడి మాటలను పాటించకుండా ముందుకు వెళ్లాను.

"పుస్తకం యివ్వవయ్యా" అని ఏకవచనంలో సంబోధించాడు. మాటలతోనే ఎదుటి మనిషి తప్పు దిద్దుదామని,

"చదువుకొంటూ వున్నానండీ" అని బహువచనంలో సంబోధించి ఈ "రెండు కాగితాలు కాగానే యిచ్చేస్తాను" అన్నాను.

తప్పు దిద్దుకునే అవకాశాన్ని అతడు వుపయోగపరచుకొనలేదు.

"గంటన్నర నీవు వుంచుకొంటే ఏమనుకొన్నావు? అటువంటి వాడివి ఆరణాలు యిచ్చి ప్రత్యేకంగా కొనుక్కోవలసింది" అన్నాడు.

నేను ఏకాంతంగా వున్నప్పుడు ఆ ముక్కలు అని వుంటే సరియైన ప్రత్యుత్తరం యిచ్చి వుండేవాడిని. కాని నలుగురి ఎదుట అనడంవల్ల నా వైఖరి మార్చుకొని, "సరే లెండి" అని వెనక్కు తగ్గాను.

ఆయనగారు వెళ్ళిపోయారు.

"మాష్టరుగారూ ఇంటికి వెళ్ళిపోదాం లెండీ- చీకటి పడుతోంది" అన్నాడు మూర్తిరాజు.

"వుండవోయ్ వెళ్లుదాం- కాస్త ఓపికపట్టు" అన్నాను.

"చూచావూ- ఆ వ్యాసం చుట్టూ, ఆ పత్రిక చుట్టూ, నాకండ్లచుట్టూ చీకట్లు క్రమ్మాయి. నాకొక్క యింగ్లీషు ముక్క కూడా కనుపించలేదు. ఒకవేళ అగుపించినా, అర్థమయింది కాదు.

వెళ్ళిపోతూ లెక్కవేసి, గంటన్నర వుంచుకొన్నందుకు ఆరణాలలో ఆరుపైసలు ఆయన బల్ల మీద పెట్టి వెళ్లాను. జేబులో వేసుకొన్నాడు.

అవి వుచిత గ్రంధాలయమని తెలుసుకొని, నావద్ద తీసుకొన్నందుకు, అనుచిత గ్రంధాలయమనే పేరు పెట్టమని కార్యదర్శిగారిని కోరాను."

"వుచితానికి-అ- ముందు పెట్టారు" అన్నాడు రాజు!

"అటువంటి అర్థం వచ్చే భావంతో"టి కార్యదర్శిగారు కూడా అనుచితగ్రంధాలయం అని బల్ల కట్టించాడు!

"అకాలమయిందండీ" అంటూ లేచాడు ఆ సాయంకాలం తను నేర్చుకొన్న వ్యాకరణ శాస్త్రజ్ఞానము ప్రదర్శించి మూర్తిరాజు.

మా నిష్క్రమణంతోటి కాలువగట్టు నిర్మానుష్యమయిపోయింది.